ప్రజాశక్తి
సోమవారం 24 నవంబర్ 2025
I
అల్లూరి సీతారామరాజు

చెక్ డ్యామ్‌కు మరమ్మతు చేయాలి

-నీటి సంఘం వైస్ చైర్మన్ వెంకట రమణ

ప్రజాశక్తి-కాశీపట్నం:అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ సరియాపల్లి గ్రామంలో ఆదివారం మినీ రిజర్వర్ చెక్ డ్యామ్ ను గ్రామ రైతులతో కలిసి నీటి సంఘం వైస్ చైర్మన్ జ్యేష్ఠ వెంకట రమణ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొంథా తుపాన్ ప్రభావంతో చెక్ డ్యామ్ పూర్తిగా కొట్టుకుపోయిందని, ప్రభుత్వం స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న రమణ

రైవాడ జలాశయంలో పడవ బోల్తా

-ఒకరు మృతి, ఇద్దరు గల్లంతు - కొనసాగుతున్న గాలింపు చర్యలు

ప్రజాశక్తి - దేవరాపల్లి/అనంతగిరి విలేకరులు

రైవాడ జలాశయంలో ఆదివారం నాటు పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. ఇద్దరు గల్లంతయ్యారు. పోలీసుల కథనం మేరకు.. అక్రమంగా కలప రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్‌గా నెలరోజుల క్రితం నియమితుడైన గాలి అప్పలరాజు ఒక యువకుడిని వెంటబెట్టుకొని జలాశయంలో పడవపై సంబంధిత ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ కలపను స్వాధీనం చేసుకొని దేవరాపల్లి అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి అధికారులకు అప్పగించాడు. తిరుగు ప్రయాణంలో మళ్లీ రైవాడ జలాశయంలో పడవపై ఇంకో ఇద్దరు యువకులతో కలిసి ప్రయాణం ప్రారంభించాడు. ఆ నలుగురు పడవలో రైవాడ గేటు నుంచి అనంతగిరి మండలం జీనబాడు రేవు వైపు ప్రయాణమయ్యారు. తీరానికి సుమారు 150 మీటర్ల దూరంలో ఉండగా ఆ పడవలోకి నీరు చేరడంతో ఒక్కసారిగా బోల్తా పడింది. నలుగురు యువకులు మునిగిపోయారు. వారిలో జాలాడ ప్రసాద్ పెద్దగా కేకలు వేయడంతో ఒడ్డున పశువులు మేపుతున్న అతని తండ్రి, బంధువులు నీటిలోకి దూకి రక్షించారు. ఈ ప్రమాదంలో జి.జీవన్ (28) మృతదేహాన్ని ఇప్పటి వరకూ వెలికితీశారు. అప్పలరాజు, అతనితో ఉన్న దబురి రమేష్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. సమాచారం అందుకున్న దేవరాపల్లి ఎస్ఐ వి.సత్యనారాయణ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక దళాలకు సమాచారం అందించారు. ప్రమాదం అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును సంబంధిత స్టేషన్‌కు బదిలీ చేశారు.

రోధిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో మృతుడు జీవన్

జీనబాడులో విషాదఛాయలు

నాటు పడవ బోల్తా పడిన ఘటనలో మృతిచెందిన జీవన్‌తో పాటు గల్లంతైన ఇద్దరు యువకులు అనంతగిరి మండలం జీనబాడు గ్రామానికి చెందినవారే కావడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చేతికందిన పిల్లలను కోల్పోయాం అంటూ వారి కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.

డ్రోన్‌లతో మారుమూల గ్రామాలకు మందుల సరఫరా

-రెడ్ వింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్

ప్రజాశక్తి-చింతపల్లి:అల్లూరి ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వెంటనే మందులు, రక్త నమూనాలు, అత్యవసర చికిత్సా సామగ్రి చేరవేసేందుకు డ్రోన్ సేవలను వినియోగిస్తున్నామని రెడ్ వింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్ తెలిపారు. ఆదివారం చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానంలో పాడేరు నుంచి భారీ సైజు డ్రోన్‌తో నిర్వహించిన ట్రైయిల్ రన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు సాధారణ రవాణా సౌకర్యాల లోపంతో సమయానికి అత్యవసర మందులు అందుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను డ్రోన్ సాంకేతికతతో పరిష్కరించేందుకు తమ సంస్థ ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. డ్రోన్ ఒక్కసారి 5 నుంచి 10 కిలోల వరకు మోసుకెళ్లగలదన్నారు., పాడేరు-చింతపల్లి మధ్య సుమారు 35 కిలోమీటర్ల దూరాన్ని తక్కువ సమయంలో చేరిందని వివరించారు. ఏజెన్సీలో అత్యవసర వైద్య సేవల బలోపేతానికి డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తాయని, భవిష్యత్‌లో రిమోట్ ప్రాంతాలన్నింటికీ ఈ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయభారతి, కృపాసాగర్, సతీష్ పాల్గొన్నారు.

డ్రోన్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్

అంగన్వాడీ భవన నిర్మాణ స్థలం పరిశీలన

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం, కుడుముల గ్రామంలో పదేళ్ల క్రితం ప్రారంభమైన పునాదుల దశలోనే ఆగిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణ స్థలాన్ని ఐసిడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీదేవి ఆదివారం పరిశీలించారు. ఈ భవన నిర్మాణం ఆగిపోవడంపై ఇటీవల గ్రామస్తులు పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలపై ఆమె గ్రామాన్ని సందర్శించి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి ఏ నిధులు వినియోగించబడ్డాయో, పనులు ఎందుకు ఆగిపోయాయో తెలియరాలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు పున:ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు డి.లక్ష్మి, తులసి, కార్యకర్తలు గబులంగి రాజేశ్వరి, రీమల జ్ఞానవతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మన్యంలో పర్యాటకుల సందడి

అరకులోయ మ్యూజియం వద్ద పర్యాటకులు

దుంబ్రిగుడలో పూలతోటల అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. దీంతో పర్యాటకుల తాకిడితో జలపాతం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో సుమారు కిలోమీటరు మేర పర్యాటకుల వాహనాలు బారులు తీరాయి. పర్యాటకులు జలపాతంలో సరదాగా స్నానాలు చేసి, ఆదివాసి గిరిజన సంప్రదాయమైన వేషధారణ ధరించి థింసా నృత్యాలు ప్రదర్శిస్తూ ఆనందంగా గడిపారు. జలపాతంలోని ఉద్యానవనంలో ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. రోడ్డుకిరు వైపులనున్న వలిసే పూలతోటలు, ప్రొద్దు తిరుగుడు పూల తోటల్లో కూడా పోటోలు తీసుకుంటూ సరదా చేసారు. చెట్టు నీడల్లో పర్యాటకులు వంటకాలు చేసుకుని వనభోజనాలు చేసి కుటుంబ సమేతంగా ఆటపాటలతో డ్యాన్స్ లు చేస్తూ ఆనందంగా గడిపారు. ఆంజోడ సిల్క్ పారంలోని అరకు పైనరీలో సైతం పర్యాటకులు తరలివచ్చి అక్కడి వ్యూ పాయింట్ లో ఫోటోలు తీసుకుంటూ సందడి చేస్తూ ఆనందంగా గడిపారు.

అరకులోయ:పర్యట కేంద్రమైన అరుపులోయలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పర్యాటక సీజన్ కావడంతో వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలన్నీ కళకళలాడాయి. అరకులోయ అల్లూరి ఏజెన్సీ అనంతగిరి మండలం చిలకలగడ్డ మొదలుకొని అరకులోయ డుంబ్రిగూడ మండలాల వరకు పర్యాటకులతో సందడి నెలకొంది. అరకు విశాఖ ఘాట్ రోడ్‌లో పర్యాటకులతో రద్దీ పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడ్డాయి. అరకులోయలోని మ్యూజియం, గిరిజన సంస్కృతిక మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం, కాఫీ మ్యూజియం కిటకిట లాడాయి. సందర్శకులు వేల సంఖ్యలో రావడంతో సందర్శిత ప్రాంతాలకు ప్రవేశ టికెట్లు రూపేణా లక్షల రూపాయలు ఆదాయం సమకూరింది.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి పాడేరు:- ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక తలారసింగి ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కంబిడి నీలకంఠం మాసాడ శోభన్ బాబు గత రెండేళ్లలో సంఘ కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షుడు చిట్టపులి శ్రీనివాస పడాల్ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా కోడా చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా కూడా రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా సాగోరి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.ఆనందకుమార్, అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల కమిషన్ సభ్యులుగా జీవివి ప్రసాద్, అర్జున్, పలాసి కృష్ణారావు, గంగన్న పడాల్, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించారు.

డ్రెయినేజీ ఏర్పాటు చేయరూ...

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని కొర్ర పెద్దపాడు పీవీటీజీ గ్రామంలో డ్రైనేజీ కాలువలు లేక గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలు లేక వర్షాకాలంలో వర్షపు నీరు నివాస గృహల బయట నిల్వ ఉండి పోతుందన్నారు. అధికంగా వర్షాలు కురిసినప్పుడు ఇళ్ల లోపలకు చొచ్చుకు వస్తుందన్నారు. దీంతో గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీవీటిజి గ్రామాల్లో అన్ని రకాల కనీస మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం చెప్తుంది .కానీ ఇప్పటి వరకు గ్రామంలో కనీసం డ్రైనేజీ కూడా నిర్మిచలేదన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పీవీటిజి గిరిజనులు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య కానరాని డ్రెయినేజీ

ప్రశాంతంగా మావోయిస్టుల నిరసనదినం

కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఆర్‌టిసి సర్వీసులు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఈనెల 18 19 తేదీల్లో మారేడుమిల్లి మండలంలో జరిగిన వరద మావోయిస్టు ఎన్‌కౌంటర్లకు నిరసనగా మావోయిస్టు జాతీయపార్టీ దేశవ్యాప్తంగా నిరసన దినం పిలుపు మేరకు రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో పోలీస్ శాఖ హై అలెర్ట్ అయ్యారు. దీనిలో భాగంగా శనివారం రాత్రి నుండి లోతట్టు ప్రాంతాలకు వెళ్లే ఆర్టిసి సర్వీసులను నిలుపుదల చేశారు. అలాగే ఘాట్‌రోడ్‌లో ప్రయాణాలు రాత్రి సమయంలో నిషేధించారు. ఆర్టీసీ సర్వీసులు లోతట్టు ప్రాంతాలకు మినహా మిగతా ప్రాంతాలకు యధాతథంగా నడిచాయి. రంపచోడవరంలోని వారపు సంత యదావిధిగా జరిగింది.

సీలేరు: నిరసన దినం నేపథ్యంలో మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా ఆంధ్రా ఒడిశా సరిహద్దు అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో పోలీసు బలగాలని మొహరించి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నైట్ సర్వీసులు తిరగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

మావోయిస్టుల నిరసన దినం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం ఎస్ఐ యాశీన్ ఆధ్వర్యంలో విస్తతంగా తనిఖీలు చేపట్టారు. ఎపి జెన్కో చెక్‌పోస్ట్, ఐటిఐ, రామాలయం జంక్షన్‌లో వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఎఓబి సరిహద్దు నుంచి వచ్చే వాహనాలను జెన్‌కో చెక్‌పోస్టు వద్ద నిలిపివేసి తనిఖీలు చేపట్టారు. ఎపి జెన్కో ఆస్తులకు మావోయిస్టుల నుంచి ఎటువంటి నష్టం కలగకుండా ఎస్పై కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో సిఆర్‌పిఎఫ్ బలగాలును మోహరించి పోలీస్ జాగిలాలతో కల్వర్టులు తదితర ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా తారసపడితే పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

సీలేరు: వాహన తనిఖీలు చేస్తున్న ఎస్పై యాసీను

అమరవీరుల సంస్మరణ సభ వాయిదా

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి - కూనవరం : ఈ నెల 24న చింతూరులో జరప తలపెట్టిన అమరవీరుల సంస్మరణ సభను వాయిదా వేస్తున్నట్టు సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తెలిపారు. ఆదివారం కూనవరంలో ఐవి అధ్యక్షతన జిల్లా కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పెన కిరణ్ మాట్లాడుతూ మావోయిస్టుల బంద్ నేపథ్యంలో 24న చింతూరులో జరగాల్సిన అమరవీరుల సంస్మరణ సభకు అధికారులు అనుమతి నిరాకరిస్తున్నట్లు తెలిపారన్నారు. ప్రజల కోసం ప్రాణాలొడ్డిన అమరవీరులను స్మరించుకుంటూ ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్న సభకు మావోయిస్టుల బంద్ సాకుగా చూపి అనుమతి నిరాకరించడం దారుణమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరుత్సాహపడద్దని, అత్యంత ఉత్సాహంతో అమరవీరుల సంస్మరణ సభను త్వరలోనే భారీగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పులి సంతోష్ కుమార్, కాకా అర్జున్, పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, నాగమణి, సీసం సురేష్, సోయం చినబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బొప్పెన కిరణ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి శివారున ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజవొమ్మంగి గ్రామానికి చెందిన బి.అబ్దుల్ మహమ్మద్ అబ్దుల్ కరీం (18) తీవ్రంగా గాయపడ్డాడు. కరీం రాజవొమ్మంగి నుండి సూరంపాలెం వైపు బైక్‌పై వెళు న్నాడు. అదే రహదారిపై ముందుగా వెళ్తున్న వ్యాన్‌ను ఢీ కొన్నాడు. వ్యాన్ అకస్మాత్తుగా బ్రేక్ వేసి రివర్స్ చేస్తుండగా బైక్ అదుపుతప్పి వ్యాన్ ని ఢీ కొట్టడంతో కరీం రెండుకాళ్లు నుజ్జు నుజ్జు కాగా, తలపై వంటిపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అతనిని తొలుత రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించగా వైద్యులు శరత్‌చంద్ర ప్రథమ చికిత్స చేసిన అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం 108లో కాకినాడ తరలించారు.

పూరిల్లు దగ్ధం : రూ.2 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: మండలంలోని అమ్మిరేకుల గ్రామంలో ఆదివారం రాత్రి గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరిగింది. క్షణాల్లో మంటలు అలుముకుని పూరిల్లు దగ్ధమైంది. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా అప్పటికే ఇంట్లో ఉన్న మొత్తం సామగ్రి కాలి బూడిదైంది. బాధితుడు చంద్రు రాజబాబు కుటుంబం వీధిన పడింది. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

దగ్ధమవుతున్న పూరిల్లు

సోకిలేరు వాగులో గల్లంతైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మోతుగూడెం: అల్లూరి జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సోకిలేరు వాగులో గల్లంతై ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుండి 13 మంది స్నేహితులు మారేడుమిల్లి విహారయాత్రకు వచ్చారు. అందులో జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్న మృతుడు కే.సందీప్ (30) ఈత కొట్టేందుకు సోకిలేరు వాగులో దిగి నది ఇవతల ఒడ్డు నుంచి అవతలకు వెళ్తుండగా మధ్యలో మునిగిపోయాడు. స్నేహితులు బయటకి తీసుకొచ్చి నపుడు కొనఊపిరితో ఉన్నాడు. హుటాహుటిన చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షచేసి మతి చెందినట్టు నిర్ధారించారు. మోతుగూడెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రుల నుంచి విద్యార్థినులు డిశ్చార్జ్

ప్రజాశక్తి-కొయ్యూరు: కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇటీవల ఫుడ్ పాయిజన్‌కు గురై పలువురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఇందులో ముగ్గురు విద్యార్థినులు విశాఖ కెజిహెచ్ లో, మరో నలుగురు రాజేంద్రపాలెంలో చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. దీంతో పూర్తి స్థాయిలో విద్యార్థినులు అందరినీ వసతిగృహానికి తరలించామని ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్ తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లు పట్టివేత

ప్రజాశక్తి -మోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, లక్కవరం రేంజ్‌లో తులసిపాక చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా,అక్రమంగా తరలిస్తున్న 248 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో 230 తాబేళ్లు బతికి ఉన్నాయి. 18 చనిపోయాయి. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విజయ్‌కుమార్ ఫారెస్ట్ సిబ్బంది, రావులపాలెం నుంచి ఒడిశా వెళ్తున ఆటోను తనిఖీ చేసి వీటని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్ట్ చేశారు.

నినాదాలు చేస్తున్న బంగారుగూడెం గ్రామస్తులు

ట్రాన్స్‌ఫార్మర్ తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- విఆర్‌పురం : మండలంలోని ములకనపల్లి పంచాయతీ బంగారుగూడెంలో ఉన్న త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒడ్డుగూడెంలో రైతుల వ్యవసాయ అవసరాల కోసం తరలించబోయే ప్రయత్నాన్ని బంగారుగూడెం గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ విషయమై ఒడ్డుగూడెం లైన్‌మెన్‌ను వివరణ కోరగా ఎఇ తీసుకెళ్లమని చెప్పారని బదులు చెప్పారు. సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి బంగారు ప్రసాద్ మాట్లాడుతూ బంగారుగూడెంలో తాగునీటి అవసరాల కోసం ఎన్నో ధర్నాలు చేసి ఐటిడిఎ కార్యాలయానికి వినతిపత్రాలు సమర్పిస్తే ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. అలాంటిది దీనిని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై బంగారుగూడెం లైన్‌మెన్‌ను వివరణ కోరగా తనకు తెలియదని బదులిచ్చారు. ఎంతో కష్టపడి ట్రాన్స్‌ఫార్మర్ తెచ్చుకున్నామని ఇది తరలిస్తే మాకు తాగునీరు కూడా ఉండదని తరలించడానికి ప్రయత్నిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. స్థానిక సర్పంచ్ సవలం మారయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీలేరులో షూటింగ్ సందడి

ప్రజాశక్తి-సీలేరు:

అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం సీలేరులో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. మజిలీ, నిన్నుకోరి సినిమాలకు దర్శకత్వం వహించిన శివ నిర్మాణ దర్శకత్వంలో మైత్రి మూవీ బ్యానర్‌పై రవితేజ హీరోగా సాయికుమార్ తదితర నటులతో రూపుదిద్దుకుం టున్న కొత్తసినిమా చిత్రీకరణ సోమవారం ప్రారంభం కానుంది. సీలేరు గ్రామదేవత మారెమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో షూటింగ్ కోసం అయ్యప్ప ఆలయం సెట్ వేస్తున్నారు. దీంతో సీలేరులో షూటింగ్ సందడి నెలకొంది. అలాగే ఎపి జెన్కో ఇండోర్ స్టేడియం వద్ద షూటింగ్ కోసం సినిమా థియేటర్ సెట్ డిజైన్‌కు రూపకల్పన చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం హీరో రవితేజ, సాయికుమార్, హీరోయిన్ ఇతర నటులు చేరుకుంటారని సోమవారం ఉదయం మారమ్మ అమ్మవారి ఆలయం వద్ద ముహూర్తపు షాట్‌ను తీస్తున్నట్టు యూనిట్ వర్గాలు తెలిపాయి. దీంతో సీలేరులో ఏపీ జెన్కో గెస్ట్ హౌస్‌తో పాటు లాడ్జీలు సినిమా కళాకారులతో నిండిపోయాయి.

అయ్యప్ప స్వామి ఆలయ సెట్ వేస్తున్న దృశ్యం

తాగునీటి బోరు పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు-2)లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జెడ్పీటీసీ కేటాయించిన నిధులతో తాగునీటి బోరు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపిటిసి చిందాడ జయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు షేక్ నాజర్ వల్లీతో కలిసి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాలయ్య మాట్లాడుతూ పాఠశాలలో 480 మంది విద్యార్థులు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ప్రధానోపాధ్యాయులు తన దృష్టికి తీసుకురాగా, రూ.3 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువాలతో ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పివిటిజి గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-కాశీపట్నం: పిఎం జన్మాన్ పథకంలో భాగంగా అన్ని పి వి టి జి గ్రామాలలో 12 రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని మహిళా సంఘం అనంతగిరి మండల అధ్యక్షురాలు కాసులమ్మ స్వాభి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిఎం జన్మాన్ పథకం కింద 12 రకాల అభివృద్ధి పనులు చేయవలసి ఉండగా ఒకే ఒక గృహ నిర్మాణ పనులు మాత్రమే జరుగుతుందని తెలిపారు. మిగిలిన 11 రకాల అభివృద్ధి పనులు జరగ లేదని అన్నారు. ఆదిమ జాతి గిరిజన తెగల గ్రామాలలో సురక్షితమైన గృహాలు, స్వచ్ఛమైన తాగునీరు, కనెక్టివిటీ రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజీ, అంగన్ వాడీ భవనాలు, విద్య ,వైద్యం (ఆరోగ్యం మరియు పోషకాహారానికి మెరుగైన ప్రాప్యత), రహదారి, టెలికం కనెక్టివిటీ, విద్యుత్ సరఫరా, స్థిరమైన జీవన ఉపాధి అవకాశాలు వంటి ప్రాథమిక సౌకర్యాలను అందించాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో భారత రాజ్యాంగం

• రాజ్యాంగ దినోత్సవ సదస్సులో ప్రొఫెసర్ కంచె ఐలయ్య

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రమాదకర స్థితిలో ఉన్న భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దళిత బహుజనులపై ఉందని ప్రొఫెసర్ కంచె ఐలయ్య షెపర్డ్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రామాటాకీస్ రోడ్‌లోని అంబేద్కర్ భవన్‌లో భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో 'ఈ రాజ్యాంగం లేకుండా భారతదేశం మనుగడ సాగిస్తుందా?' అంశంపై సదస్సులో ఐలయ్య మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి పాలకులు రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని తెచ్చే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని పాలించేది నరేంద్రమోడీ, అమిత్ షా కాదని, ఆదానీ, అంబానీలేనని దుయ్యబట్టారు. జర్నలిస్టు తులసి చందు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ద్వారా ఫ్యాక్టరీ భూములు కాజేసే కుట్ర జరుగుతోందన్నారు.ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, మనువాదంపై అనేక వీడియోలు చేస్తున్న కారణంగానే తనపై దాడులు చేస్తున్నారన్నారు. తనను రాజ్యాంగమే రక్షిస్తుందని స్పష్టం చేశారు. జర్నలిజమే రాజ్యాంగాన్ని కాపాడుతుందని, ఈ రంగంలోకి అంబేద్కర్ వాదులు రావాలని పిలుపునిచ్చారు. మూఢనమ్మకాల వ్యతిరేక వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ .బైరి నరేష్ మాట్లాడుతూ మనుషుల మధ్య అసమానతలు సష్టించిన మనుధర్మానికి విరుగుడు రాజ్యాంగమేనని, రాజ్యాంగ పరిరక్షణలో అంబేద్కర్ అభిమానులు ప్రచారకులుగా, కార్యకర్తలుగా మారాలన్నారు భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో బహుజన కళామండలి వ్యవస్థాపకుడు ఉదయభాస్కర్, బీర రత్నకుమారి, కె.చిన్నారావు, జెవి.ప్రభాకర్ మాట్లాడారు

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి

ఆదివాసీ విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: ఆదివాసి మావోయిస్టు నేత హిడ్మాను హతమార్చేందుకు చేసిన ఎన్‌కౌంటర్ బూటకమని దీనిపై హైకోర్ట్ సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి నిజ నిర్ధారణ చేసి దేశ ప్రజలకు తెలియ చెప్పాలని ఆదివాసీ విద్యార్థి ఉద్యోగ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ విషయంపై ఆదివారం పాడేరులోని జి. ఎస్.యు లైబ్రరీ భవన్‌లో పలు ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, దండకారణ్య లిబరేషన్ అండ్ ఆర్గనైజేషన్ జాతీయ సలహాదారు సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ, మావోయిస్టు నేత మడవి హిడ్మా ది బూటకపు ఎన్కౌంటరేనని అనేక సంఘాలు ఘోషిస్తున్నాయన్నారు.ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపితే వాస్తవాలు ప్రజల దృష్టికి వస్తాయన్నారు. హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకమని ప్రపంచమంతా చెప్తోందన్నారు. లొంగిపోవాలని పిలుపునిస్తూనే నిరాయుదాలుగా ఉన్న వారిని పట్టుకొని కాల్చి చంపుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయన్నారు. ఈ ఎన్కౌంటర్ అలాంటిదేనని అందుకే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తున్న పాలకులు అందుకు విరుద్ధంగా తుపాకులతో కాల్చి చంపడమేమిటని ప్రశ్నించారు. హిడ్మా ను ఎన్కౌంటర్ చేసి ఎందుకు హత మార్చారో ప్రభుత్వాలు ప్రజలకు వివరించాలన్నారు.హైకోర్టు సిట్టింగ్ జడ్జితో పూర్తి విచారణ చేపట్టి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించకుండా బూటకపు ఎన్కౌంటర్ చేయడం మానుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు పలాసి కృష్ణారావు, డిఎల్ఓ మాజీ రాష్ట్ర అధ్యక్షులు రంజిత్ కుమార్, డిఎల్ఓ జిల్లా అధ్యక్షులు కిముడు, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు చుంచు రాజు, దండకారణ్య విద్యార్థి సమితి రాష్ట్ర నాయకులు ఎన్ జాన్ బాబు, పలువురు మహిళా నేతలు తదితరులు హిడ్మా ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తూ, న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న నాయకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని దారెల పంచాయితీ పరిధిలో కుమ్మరిపుట్టు, తల్లింబ, చివుకుచింత గ్రామాల్లో ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, లక్ష్మీపురం గ్రామపంచాయితీ సర్పంచ్ కొర్రా త్రినాధ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి కొర్రా నర్సయ్య మృతి చెందిన నవజాత శిశువుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె త్రినాధ్, మండల కార్యదర్శి నర్సయ్య లు మాట్లాడుతూ, వైద్య శాఖ అధికారులు తూతూ మంత్రంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారన్నారు. మృతి చెందిన శిశువుల తల్లులు ఆరోగ్య పరంగా ఇబ్బందులను ఎదుర్కొంటు, బలహీనతలకు గురై నీరసంగా ఉన్నారని తెలిపారు.ప్రభుత్వ అధికారులు స్పందించి పౌష్టిక ఆహారం, ఉచితంగా బస్తా బియ్యం, సరిపడా సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తల్లులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కిలగడ పీహెచ్సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాల్లో వైద్య అధికారులు పర్యటనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వి.లైకోన్, కె.శ్రీను, దేవన్న, గ్రామస్థులు పి.సహదేవ్, కామేష్, త్రినాధ్, సాధురాం పాల్గొన్నారు.

రన్ ఫర్ అంబేద్కర్ విజయవంతం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ: భీమ్ సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ సంబరాలలో భాగంగా రన్‌ఫర్ అంబేద్కర్ కార్యక్రమం విజయవంతమైందని భీమ్‌సేన వ్యవస్థాపక అధ్యక్షులు రవి సిద్ధార్థ తెలిపారు. ఈ సందర్భంగా రవి సిద్దార్ధ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను లక్ష్యాలను ప్రజలకు అవగాహన కలిగించే దిశగా 2015 నుంచి ఈ రన్ ఫర్ అంబేద్కర్ కార్యక్రమాన్ని విశాఖ బీచ్ లో నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ రన్‌కు విశాఖలోని ప్రజలందరూ పాల్గొనడం ఎంతో ఆనందకరమని తెలియజేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మాజీ కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌బాబు మాట్లాడుతూ బీం సేన ఎన్నో ఏళ్లుగా ఈ రన్‌ఫర్ అంబేద్కర్ కార్యక్రమాన్ని చేస్తుందని 11 వ ఏడాది విజయవంతంగా పూర్తి చేసిందని తెలియజేశారు.

శంకర్ ఫౌండేషన్ 'విజనరీ ఇన్‌సైట్స్'కు జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్ కంటిఆసుపత్రి నెలవారీ వార్తాలేఖ 'విజనరీ ఇన్‌సైట్స్'కు జాతీయస్థాయి గుర్తింపు లభించిందని డిప్యూటీ జనరల్ మేనేజర్, ఎడిటర్ కె బంగారురాజు తెలిపారు. 47వ పిఆర్ఎస్ఐ జాతీయ అవార్డుల్లో ఈ వార్తాలేఖకు ద్వితీయ బహుమతి వరించిందని పిఆర్ఎస్ఐ చైర్మన్ డాక్టర్ అజిత్ పాఠక్ ఆదివారం ఢిల్లీలో ప్రకటించారన్నారు.దేశవ్యాప్తంగా పలు ప్రధాన ప్రభుత్వరంగ, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛందసంస్థలతో పోటీపడి శంకర్ ఫౌండేషన్ మంత్లీ మేగజైన్ జాతీయ స్థాయి గుర్తింపును వరుసగా రెండోఏడాది సొంతం చేసుకుందన్నారు. వచ్చేనెల 13-15తేదీల్లో డెహ్రాడూన్‌లో జరిగే పిఆర్ఎస్ఐ జాతీయ సదస్సులో అవార్డును ప్రదానం చేస్తారు. విజనరీ ఇన్‌సైట్స్‌కు జాతీయ గుర్తింపు రావడంపై ఎం రాందాస్ నేతృత్వంలోని ట్రస్టీల బోర్డు, మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణ కుమార్, ట్రస్టీలు ఎ ప్రసన్న కుమార్, శ్రీ ఎ విజయ్ కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకష్ణన్ తదితరులు మేగజైన్ ఎడిటర్ కె.బంగారురాజు, సంపాదక బృందానికి అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కించయిపుట్టు పంచాయతీ మర్రిపుట్టుకు చెందిన కిముడు శ్రీధర్ ఆదివారం ఇంట్లో కరెంట్ పొయ్యిని రిపేరు చేస్తున్న సమయంలో కరెంట్ షాక్ కి గురై మృతి చెందాడని స్థానిక ఎస్ ఐ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు హుటాహుటిన మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించడంతో స్థానిక సిహెచ్ వైద్యులు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ, సర్పంచ్ సుభాష్‌చంద్ర, లక్ష్మీపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ త్రినాథ్, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎన్ ఎం శ్రీను, టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

బైకిస్టు దుర్మరణం

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని స్కూటీ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన చోటు చేసుకుంది. మండలంలోని తాడేపట్టు పంచాయతీ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. సత్యసాయి గుడి సమీపంలో స్కూటీ అదుపుతప్పి రహదారిపై పడిపోవడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే కురబోయిన శ్రీను (45) స్వగ్రామమైన నూర్పురై గ్రామానికి స్కూటీపై వస్తున్నాడు. గడుగు పల్లి సత్యసాయి ఆలయం సమీపానికి రాగానే వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి రహదారిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

నిర్మాణంలో ఉన్న ఇంటి పై నుంచి పడి బాలునికి తీవ్ర గాయాలు

గాయపడిన బాలుడు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలంలోని డెయిరీ నగర్ గ్రామంలో పీఎం జన్మన్ పథకం కింద నిర్మాణం జరుగుతున్న గృహంలో ఓ బాలుడు ప్రమాదానికి గురయ్యాడు. గ్రామానికి చెందిన కొర్ర మహేష్ (7) ఆదివారం మధ్యాహ్నం నిర్మాణంలో ఇంటి పైకప్పుపై ఆడుకుంటూ ఆకస్మికంగా కాలుజారి కిందపడిపోయాడు. దీంతో ఆ బాలుడి కాలు విరిగిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అవసరమైన ఆర్థోపెడిక్ సదుపాయాలు లేకపోవడంతో వైద్యుల సూచన మేరకు బాలుడిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో అత్యవసర సేవలు కూడా అందడం లేదని కొర్ర మల్లుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లాడికి కాలు విరిగినా మైదాన ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు.

నందగిరినగర్‌లో పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి- సీతమ్మధార : నగర పోలీస్ కమిషనర్ డాక్టర్.శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం దరి నందగిరి నగర్‌లో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సిఐ ఉమాకాంత్, ఎస్ఐ వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసులు నందగిరినగర్‌లో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని పది బైక్‌లు, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్ ఉన్న రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఇంటి వద్దనే డెలివరీ చేసిన 108 సిబ్బంది

ప్రజాశక్తి-కొయ్యూరు: కొయ్యురు మండలం, మూకుడుపల్లి గ్రామానికి చెందిన బోనంగి కందేరమ్మ పురిటి నొప్పులతో బాధపడు తుండగా, గ్రామస్తులు 108 అంబులెన్సుకి ఫోన్ చేసారు. కొయ్యురు అంబులెన్సు సిబ్బంది గ్రామానికి చేరుకుని ఆసుపత్రికి తీసుకెళ్లే సమయం లేకపోవడంతో ఇఎంటి ఈశ్వరరావు, పైలట్ హరిప్రసాద్ ఇంటివద్దనే డెలివరీ చేశారు. మగశిశువు జన్మించినట్లు తెలిపారు. ప్రసవం అనంతరం మెరుగైన చికిత్స కోసం రాజేంద్రపాలెం ఆసుపత్రికి తరలించినట్టు 108 సిబ్బంది తెలిపారు. కుటుంబసభ్యులు గ్రామస్తులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పలువురికి ఉచిత కంటి పరీక్షలు

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -కొయ్యూరు: కొయ్యూరు మండలంలోని స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. విజయనగరం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి , ఎవైడ్‌బుల్ బ్లైండ్‌నెస్ చారిటబుల్ ట్రస్ట్ సారధ్యంలో కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమం లో సర్పంచ్‌తో పాటు, కొయ్యూరు పంచాయతీ ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ ఆఫీసర్ దుమంతి కృష్ణ, ఎంపిటిసి కొనిశెట్టి రమణ, నేత్రవైద్యులు రాంబాబు, రాజేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథ బాలికకు ఆర్థికసాయం

అనితాలక్ష్మికి నగదు అందిస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- కొయ్యూరు: కొయ్యూరు మండలం, మూలపేట పంచాయతీ పరిధి కొండసంత గ్రామానికి చెందిన మునోజి అనితాలక్ష్మి (14)కి స్థానిక రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ ఆదివారం రూ.7వేలు ఆర్థికసాయం అందించారు. అనిత లక్ష్మి తల్లి భవాని గత 5 సంవత్సరాల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. అప్పటినుండి తండ్రి పోతురాజు, అమ్మమ్మ దేవుడమ్మ ఆమె పోషణ చూసేవారు. కానీ దురదృష్టవశాత్తు గత 10రోజుల కిందట తండ్రి పోతురాజు బ్రెయిన్ స్ట్రోక్‌తో, అమ్మమ్మ దేవుడమ్మ అనారోగ్యంతో ఒకే రోజు ఇద్దరూ మృతి చెందారు. దీంతో ఆమె అనాథగా మిగిలిపోయింది. ఈ విషయం పత్రిక ద్వారా తెలుసుకుని కొండసంత గ్రామానికి వెళ్లి అనితలక్ష్మికి స్థానిక సత్యనారాయణ ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతన్న - మీ కోసం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: నేటి నుండి ఈ నెల 29 వరకూ గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక వ్యవసాయ అధికారి చక్రధర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు కుటుంబాన్ని రైతుసేవా కేంద్రం అసిస్టెంట్, పశుసంవర్ధక శాఖ సహాయకులు తదితర ఉద్యోగులు కలిసి, రైతన్న మీ కోసం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, నీటి భద్రత, డిమాండ్ అధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రొసెసింగ్, ప్రభుత్వ మద్దతు, రబీ 2025-26, ఖరీఫ్, 2026-27 రబీ కార్యాచరణ ప్రణాళిక గూర్చి, ప్రకృతి వ్యవసాయం, ఏపిఐఎంఎస్ యాప్ గూర్చి తెలియచేయడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 3న గ్రామసభ పెట్టి రాబోవు 3 సీజన్ల యాక్షన్ ప్లాన్ తయారు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి సిబ్బంది సహకరించాలని కోరారు.

ఎటపాక: రైతన్న మీకోసం వారోత్సవాలను 24 వ తేదీ నుండి 29వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ నాగమణి పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు కుటుంబాన్ని కలిసి , రానున్న ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు విధానాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను తెలియజేస్తామన్నారు. అన్నిశాఖల మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది టీములుగా ఏర్పడి ప్రతిరోజు 90 కుటుంబాలకు ప్రభుత్వం నిర్మించిన ఐదు అంశాలు తెలియపరచాల్సి ఉందన్నారు.

సత్యసాయి సేవా ట్రస్ట్ సేవలు అభినందనీయం

పాడేరు: నివాళి అర్పిస్తున్న అధికారులు, నేతలు

రాజఒమ్మంగి : ఎంపిపి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సత్యసాయి జయంతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సుమారు 750 గిరిజన గ్రామాల్లో మంచినీటి సదుపాయం కల్పించి, గిరిజన ప్రజల దాహార్తిని తీరుస్తున్న సత్యసాయి ఫౌండేషన్ (సత్య సాయి సేవా ట్రస్టు) సేవలు అత్యంత ప్రశంసనీయమని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు కొనియాడారు. ఫౌండేషన్ కేవలం తాగునీటి కల్పన కే పరిమితం కాకుండా, మారుమూల ప్రాంతాలలోని గిరిజనులకు నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు, తరచూ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందన్నారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సత్య సాయి జన్మదిన వేడుకలలో భాగంగా సత్యసాయి చిత్రపటానికి ఆర్డిఓ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్య సాయి సేవ ట్రస్టు, ఫౌండేషన్ సంస్థలు చేస్తున్న ఈ అత్యద్భుతమైన కృషిని ప్రభుత్వం గుర్తించిందన్నారు. జనసేన పార్టీ నేత వి.గంగులయ్య కలెక్టర్ ఆఫీసు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రసాద్, సబ్ కలెక్టర్ ఆఫీసు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలస్వామి పాల్గొన్నారు.

కొయ్యూరు: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి వేడుకలను కొయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంపిపి బడుగు రమేష్‌బాబు మాట్లాడుతూ సత్యసాయిబాబా సేవలను స్మరించుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన సత్యసాయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.సత్యసాయి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపిడిఒ యాదగిరిశ్వరరావు, ఎపిఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సత్యసాయి ట్రస్ట్ మండల చైర్మన్ రాంబాబు, టిడిపి నాయకులు గుప్తా, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో చెకుముకి సంబరాలు

రంపచోడవరం: షీల్డ్,ప్రశంస పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు


రాజఒమ్మంగి : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - రంపచోడవరం: ముసురుమిల్లి (రంపచోడవరం) : ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు పరీక్షలు నిర్వహించారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రభుత్వ పాఠశాల విభాగంలో మొదటి బహుమతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగి, రాజవొమ్మంగి మండలం, ద్వితీయ బహుమతి గిరిజన సంక్షేమ బాలిక ఉన్నత పాఠశాల దామనపల్లి దేవీపట్నం మండలం, తతీయ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొంటువానిపాలెం ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతిగా హొూసన్నా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వేటమామిడి అడ్డతీగల మండలం, ద్వితీయ బహుమతిగా లెనోరా హైస్కూల్ రంపచోడవరం రంపచోడవరం మండలం స్థానాలు కైవసం చేసుకున్నాయి. జిల్లాస్థాయిలో విజేతలైన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తతీయ బహుమతులుగా మెమొంటోలు, ప్రశంసాపత్రం, ప్రతి పాఠశాల ఉపాధ్యాయులకు జ్ఞాపికలు మంపా సోమరాజు, సన్యాసమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె మంపా శాంతిప్రియ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజవొమ్మంగి ఆర్థిక సహాయంతో మెమెంటోస్, మెడల్స్, జ్ఞాపికలు అందజేయడం జరిగింది. జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు బొజ్జియ్య, గౌరవ అధ్యక్షులు విశ్వరాజు, ఉపాధ్యక్షులు శారపు చిన్న బాబు, కారం శ్రీను, కోశాధికారి నెరం వెంకటరమణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కారం సూరిబాబు, రంపచోడవరం యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సనాతనబాబు, వెంగళరావు, దేవీపట్నం మండల అధ్యక్షులు కుంజం శ్రీనివాస్‌దొర, మారేడుమిల్లి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, కృష్ణారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మామిడి బాలరాజు, డిప్యూటీ వార్డెన్ విజయ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: రంపచోడవరం ముసురుమిల్లిలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో స్థానిక గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పలువురు విద్యార్థులను అభినందించారు. రాజవొమ్మంగి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌బిఐ గ్రీన్ మారథాన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఎస్‌బిఐ గ్రీన్ మారథాన్ సీజన్ 6 ఆదివారం ఉదయం విశాఖపట్నంలో ఉత్సాహంగా నిర్వహించారు. రామకృష్ణ బీచ్ నిర్వహించిన ఈ "రన్ ఫర్ గ్రీనర్ ఇండియా" అనే మారథాన్ లక్ష్యానికి నీలిరంగు సముద్ర తీరం, సుసంపన్నమైన ప్రకృతితో కూడిన విశాఖపట్నం అర్థవంతమైన వేదికగా నిలిచింది. మారథాన్‌ను ఎస్‌బిఐ ఉపప్రధాన మేనేజర్ రాహుల్ సంకృత్యా, ప్రజాసంబంధాధికారి కె.ఉమామహేశ్వరరావు, జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఎఐఎంఎస్ సర్టిఫైడ్ మారథాన్ 5కే, 10కే, 21కే విభాగాల్లో జరిగింది. రక్షణ బలగాలు, ప్రొఫెషనల్ అథ్లెట్లు, రన్నింగ్ గ్రూపులు తొలిసారి పాల్గొన్న వారు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో 3,900 మందికి పైగా పౌరులు, భారత నౌకాదళం/రక్షణ బలగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ కమిటీ నియామకం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: పాతనగరంలోని బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఉత్సవ కమిటీని ప్రభుత్వం నియమించింది.ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సిఫార్సు మేరకు నియమించబడ్డ కమిటీలో 13 మంది ఉండగా, వీరిలో 32 వ వార్డు జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు, వాకముల్ల అక్కలనాయుడు,ధనలకోట మాధురి, చింతపల్లి విమలకుమారి, నల్లబల్లి వెంకట లక్ష్మి, కేదార లక్ష్మి, ఇందన భద్రరావు, మేడపాటి శ్రీధర్,యేంద్ర విజయలక్ష్మి, భూమిరెడ్డి కష్ణారావు, కొప్పల రామ్‌కుమార్,ఎం. లక్ష్మి నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్ శర్మ(ఆలయ అర్చకుడు) ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ,ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరిస్తూ, కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను విజయవంతంగా జరిగేందుకు కషి చేయాలని వారిని అభినందించారు.

కోవిడ్-19 టీకా పనితనంపై పరిశోధనలు

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పిజి చదువుతున్న విద్యార్థుల బృందం రెండున్నర సంవత్సరాలుగా కోవిడ్-19 టీకా పనితనంపై బహు పరిశోధనలు చేసి, ఇటీవలే కరోనా వైరస్ కోవిడ్-19 టీకా నుండి తప్పించుకొనే ఒక నూతన విధానాన్ని కనుగొన్నారు. టీక్యాబ్స్ - ఇ ప్రయోగశాల వ్యవస్థాపకులు ప్రొఫెసర్ రవికిరణ్ యేడిది బృందానికి మార్గదర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ స్పైక్ ప్రోటీన్ లో కొన్నిభాగాలు అస్థిరత్వం కలిగి ఉండడం వలన అవి ఘనపదార్థాలుగా కాకుండా క్షణికకాలం పాటు ద్రవస్థితిలోకి పరివర్తనం చెందుతాయని అందువలన మనం తీసుకున్న కోవిడ్-19 టీకా ప్రభావంతో శరీరంలో ఉత్పత్తైన ప్రతిరోధకాలు అయోమయ పరిస్థితిలో వైరస్‌ను నిరోధించే సామర్థ్యాన్ని కోల్పోతాయి అని ప్రొఫెసర్ రవికిరణ్ యేడిది తెలిపారు. తన బృందంలోని విద్యార్థులు ముఖ్యంగా మణికంఠ సోడసాని, అభినవ్ గ్రంధి, నిహారిఖ మూకల, జాహ్నవి చింతలపాటి, మాధురి విస్సాప్రగడ బయోఫిసిక్స్, కంప్యూటర్ సిములేషన్స్, మోలెక్యూలర్ బయాలజీ , బయోకెమిస్ట్రీ మరియు జీన్ క్లోనింగ్ ప్రయోగాలు చెయ్యగా మధుమిత అగ్గున్న పలు సాఫ్ట్‌వేర్ పద్ధతులను ఈ ప్రయోగాలతో జోడించాడన్నారు. ప్రొఫెసర్ రవికిరణ్‌ను ఆయన బృందాన్ని ఎయు ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ అభినందించారు.

యుఎం స్ట్రోక్ అప్‌డేట్ 2025' పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సలో వస్తున్న ఆధునిక మార్పులు వైద్య సాంకేతికతలపై అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో "యుఎం స్ట్రోక్ అప్‌డేట్ 2025" పేరిట ఒక భారీ సమ్మిట్‌ను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో, వైద్య నిపుణులు బ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధించిన తాజా చికిత్సలు, కొత్త సాంకేతికతలు, వాటిని సమర్థం గా ఉపయోగించే విధానాలపై విస్తృతంగా చర్చించారు. న్యూరో వాస్క్యులర్ ఇంటర్వెన్షన్ చీఫ్, డాక్టర్ శివశంకర్ దలై, మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనికి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.